ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 21 సెప్టెంబరు 2024



## స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి బదిలీ

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 20: జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అధికారి దాసరి నాగార్జున అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఇదే సంస్థలో టెక్నికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఈయన ఇంతకాలం ఇన్‌చార్జి ఆఫీసర్‌గా ఉన్నారు. ఈయన స్థానంలోకి విజయ్‌వినిల్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ యువత నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జ్యూటీవ్ అధికారి జి.గణేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కడపలోని జడ్పీ కార్యాలయం వద్ద అన్నక్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి



## మరో నాలుగు అన్నక్యాంటీన్లు ప్రారంభం

ప్రొద్దుటూరు/కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20: జిల్లాలో మరో నాలుగు అన్న క్యాంటీన్లు ప్రారంభం అయ్యాయి. గురువారం జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలులో ఒక్కొక్కటి చొప్పున మూడు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం కడపలో మూడు, ప్రొద్దుటూరులో ఒకటి అందుబాటులోకి వచ్చాయి. ప్రొద్దుటూరులోని జమ్మలమడుగు రోడ్డులో టీబీ బంగ్లా వద్ద అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడాన్ని సహించలేని జగన్ ఐదేళ్ల తన ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లు మూసేసి పేదల కడుపుకొట్టాడన్నారు. పట్టణాల్లో కార్మికులు, దినసరి కూలీలు, అసంఘటిత కార్మికులకు ఉదయం టిఫిన్ అయినా మధ్యాహ్నం రాత్రి భోజనం అయినా 5 రూపాయలకే అందజేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. అన్నక్యాంటీన్‌కు వచ్చిన ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే స్వయంగా అన్నం వడ్డించారు. జనంలో కూర్చొని ఆయన కూడా భోజనం చేశారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టీడీపీ మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాగా తొలిరోజు 600 భోజనాలకు అయిన రూ.3000ను బద్వేలు రాజేంద్రనాథరెడ్డి తనతండ్రి జ్ఞాపకార్థం విరాళంగా ఇచ్చారు.

కడప నగరంలోని జడ్పీ కార్యాలయం, పాతబస్టాండు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లను కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రారంభించారు. డీఆర్వో గంగాధరగౌడ్, మున్సిపల్ కమిషనర్ వైవో నందన్‌లతో కలిసి క్యాంటీన్‌లో భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదలకు ఆకలి అవస్థ ఉండకూడదనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లు వివిధ అవసరాల నిమిత్తం కడపకు వచ్చే పేదలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, వల్లూరు రవిశేఖర్‌రెడ్డితో పాటు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు అన్న క్యాంటీన్ ప్రారంభించి వడ్డిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

# అసాంఘిక శక్తులపై గురి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యానికి అనుగుణంగా పోలీసు యంత్రాంగం అడుగులు వేస్తోంది. వైసీపీ హయాంలో ఇక్కడ లాండ్ అండ్ ఆర్డర్ అంతా వన్‌సైడే ఉండేది. సమర్థ అధికారిగా గుర్తింపు పొందిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు జిల్లాకు రావడంతో ప్రక్షాళన మొదలైంది. వన్‌సైడ్ పోలీసింగ్ విధానానికి స్వస్తి చెప్పారు. సీఎం చంద్రబాబు ప్రాధాన్యత అంశాలైన శాంతిభద్రతలు, గంజాయి, గ్యాంబ్లింగ్‌పై దృష్టి పెట్టి చడీచప్పుడు కాకుండా ఎస్పీ తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదని డిసైడ్ అయ్యారు. అసాంఘిక శక్తులపై గురిపెట్టారు. గంజాయిపై దాడులు చేస్తున్నారు. మట్కా జూదం నిర్వహించేవారికి, రౌడీలకు కౌన్సెలింగ్, ఆరుబయట మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేస్తున్నారు. జనంలో నిత్యం పోలీసులు కనిపించే విధంగా ఏదో ఒక కార్యక్రమం చేస్తున్నారు. జిల్లాలో ఎర్రచందనం, గంజాయి, బెట్టింగ్, జూదంలో కీ రోల్‌గా ఉన్న 30 మందిని గుర్తించారు. వీరిని జిల్లా బహిష్కరణ చేసేందుకు సిద్ధమవుతున్నారు.



వల్లూరులో పోలీసులు సీజ్ చేసిన ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు



- ఎర్రచందనం, గంజాయి, బెట్టింగ్‌రాయుళ్లపై పీడీయాక్టు
- జిల్లా బహిష్కరణకు రంగం సిద్ధం
- 30 మంది క్రిమినల్స్ గుర్తింపు
- బద్వేలు భూకబ్జాలపై ప్రత్యేక దృష్టి
- 23 మంది కబ్జాదారుల గుర్తింపు
- తీవ్ర చర్యలకు సన్నద్ధం
- శాంతిభద్రతలపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మార్కు పోలీసింగ్

(కడప-ఆంధ్రజ్యోతి): శాంతభద్రతలు అదుపులో ఉంటేనే ప్రతి పౌరునికి స్వేచ్ఛ ఉంటుంది. వైసీపీ హయాంలో శాంతిభద్రతలు గల్లంతయ్యాయి. అసలు పోలీసింగే లేదు. అందుకే మొన్న జనం ఓట్ల సునామీతో వైసీపీని ఇంటిదారి పట్టించారు. చంద్రబాబు అంటేనే శాంతిభద్రతలకు మారుపేరుగా పేరుంది. ఇప్పుడు జిల్లాలో శాంతిభద్రతల పట్ల రాజీ లేకుండా అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. జిల్లాలో ఎర్రచందనం విస్తారంగా ఉంది. అయితే దానిని నరికివేసి విదేశాలకు పంపిస్తున్నారు. ఇక పాలప్యాకెట్లు లేని అంగడి ఉండదేమో కానీ గంజాయి లేని ఊరే లేదు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట వైసీపీ హయాంలో విచ్చలవిడిగా జరిగాయి. వాటికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సబ్ డివిజనుకు ఆరుగురు కీలక నేరగాళ్లను గుర్తించారు. వీరంతా గంజాయి, బెట్టింగ్, ఎర్రచందనం అక్రమరవాణాలో ముఖ్యమైనవాళ్లు. వారు ఎన్ని కేసుల్లో ఉన్నారు, ఏం చేశారు, ఎంత ప్రమాదకర వ్యక్తులు అనే సమాచారం ప్రకారం జాబితా సిద్ధం చేశారు. వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని అవసరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 30 మంది నేరగాళ్ల జాబితా సిద్ధమైంది.

### బద్వేలు భూకబ్జాలపై సీరియస్


బద్వేలు అంటేనే కబ్జాల పట్టణం అన్నట్లుగా మారింది. వైసీపీ హయాంలో భారీ స్థాయిలో కబ్జాలు జరిగాయి. కోట్లాది రూపాయల ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు కొల్లగొట్టారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేశారు. అప్పుడు రెవెన్యూ పోలీసు అంతా వన్‌సైడే ఉండేది. నకిలీ పట్టాలు, కబ్జాలపై ఓ అధికారి హంగామా చేశారు. కబ్జాదారుల భరతం పడతామని చెప్పారు. అయితే ఆ సారు నకిలీ పట్టాల పేరుతో కోట్లు వెనకేసుకున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. కోట్ల రూపాయల భూములను ఆ సారు వైసీపీ నేతలకు తన ఆస్తిగా రాసిచ్చారని.. ఇందుకు తానూ పెద్ద మొత్తంలో వెనకేసుకున్నారని అంటారు. ఇప్పుడు ఆ సారు ఓ అమాత్యుని పంచన ఉన్నారు. ఆ సారు చేసిన కలెక్షన్లు, వైసీపీ నేతలకు కట్టబెట్టిన భూములు, నకిలీపట్టాల కేసుల వ్యవహారాన్ని అటకెక్కించిన తీరు చూసి పోలీసులే అవాక్కయ్యారంటారు. ఆ సారుపైనా విచారణకు రంగం సిద్ధమవుతోంది. బద్వేలులో మోస్ట్‌వాంటెడ్ భూకబ్జాదారులు 23 మందిని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నకిలీ పత్రాల సిద్ధహస్తులతో పాటు బోవిళ్లవారిపల్లె, బద్వేలు గ్యాంగ్‌లు ఇతర గ్యాంగ్‌ల చిట్టాను పోలీసులు తీసుకున్నారు. అప్పుడు వైసీపీ హయాంలో కబ్జా చేస్తే.. ఇప్పుడు బోవిళ్లవారిపల్లె బ్యాచ్‌తో పాటు మరికొందరు బద్వేలులో కబ్జాలకు పాల్పడుతుండడంతో వారిపైనా కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చేవారంలో కలెక్టరు, ఎస్పీ బద్వేలులో భూకబ్జాల భరతం పట్టేందుకు అక్కడ పర్యటించనున్నారు. బద్వేలులో జరుగుతున్న భూ ఆక్రమణలపై విచారణ చేపట్టేందుకు మైదుకూరు డీఎస్పీని వారం రోజుల పాటు బద్వేలులోనే ఉంచనున్నారు.

### ఐదేళ్ల తరువాత మళ్లీ పోలీసింగ్

జూన్ 4 వరకు పోలీసులు అంటేనే వీరంతా వైసీపీ అనుకూలురనే ముద్ర ఉండేది. కొంతమంది పోలీసులు తాము ఖాకీలమని మరిచి వైసీపీ సర్వెంట్లుగా పని చేశారు. అప్పట్లో వైసీపీ సర్వెంట్లుగా పనిచేసిన కొందరు ఎస్ఐలకు ఇప్పుడు కూడా మంచి పోస్టులే దక్కాయి. కొందరు ఎమ్మెల్యేలు, నేతలు తీవ్రస్థాయిలో వత్తిడి తెచ్చి టీడీపీ అంటే జీర్ణించుకోలేని అధికారులకు కూడా కీలకమైన పోస్టులు ఇప్పించారని చర్చ ఉంది. అయినప్పటికీ మూడునెలల కిందటతో పోలిస్తే ఇప్పుడు పోలీసింగ్‌లో కొంత మార్పు కనిపిస్తోంది. గత ఐదేళ్లలో లేని విధంగా మళ్లీ పోలీసులు రోడ్లపైకి రావడం, అసాంఘిక శక్తులపై గురిపెట్టడం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం గంజాయి నిర్మూలనను చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గంజాయిని అరికట్టేందుకు ఆగస్టు, సెప్టెంబరులో ప్రత్యేక దృష్టి పెట్టారు. గంజాయి విక్రయదారులు, సరఫరా దారులను గుర్తించి వారిపై అటాక్ చేశారు. కడప సబ్ డివిజన్‌లో 11, ప్రొద్దుటూరులో 4, మైదుకూరులో 6, జమ్మలమడుగు లో1.. మొత్తం 22 కేసులు నమోదు చేశారు. 56 మందిని అరెస్టుచేసి 41.33 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిఘాలో గుర్తించిన మేరకు గంజాయి దొరికే పలు భవనాలు, బాలుర హాస్టళ్లను తనిఖీ చేస్తున్నారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

- రౌడీయిజం కొందరికి ఫ్యాషన్‌గా ఉంది. ముఖ్యంగా వైసీపీ హయాంలో రౌడీషీటర్లు విజృంభించారు. ఇప్పుడు పోలీసులు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలో 667 మంది రౌడీషీటర్లు ఉన్నారు. కడప సబ్‌డివిజనులో 195 మంది, పులివెందులలో 111, ప్రొద్దుటూరులో 133, జమ్మలమడుగులో 122, మైదుకూరు సబ్ డివిజనులో 109 మందికి ఆగస్టు నుంచి ఇప్పటి వరకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మార్పు రాకపోతే వీరిపై కూడా వేటు వేసేందుకు సిద్ధమయ్యారు.



కడపలో పోలీసుల కవాతు

- గతంలో ఎన్నికల సమయంలో గొడవలు లేకుండా ఉండేందుకు గాను దుందుడుకుగా వ్యవహరించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసేవారు. ఇటీవల ఆగస్టు నుంచి సెప్టెంబరు వరకు 70 కేసుల్లో 323 మందిని బైండోవర్ చేశారు.
- ఆరుబయట మద్యం సేవించడం, గొడవలు పడడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 3,013 మందిపై కేసులు నమోదు చేశారు.
- నిత్యం పోలీసులు జనాల్లో ఉండే విధంగా శాంతిభద్రతల్లో భాగంగా పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు.
- చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం ఉచిత ఇసుక. అయితే కొందరు కూటమి నేతలు ఇసుకను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. దీనిపై ఎస్పీ సీరియస్‌గా ఉన్నారు. అక్రమ ఇసుక రవాణాదారులపై కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. వల్లూరు మండలం నుంచి గురువారం రాత్రి ఇసుక అక్రమరవాణా అయింది. స్పెషల్‌పార్టీతో దాడులు చేసి 21 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇలా.. జిల్లాలో అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకు పోలీస్ బాస్ తనదైన స్టైల్‌లో ముందుకు పోతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మైలవరం టెక్స్‌టైల్ పార్కులో 93 మందికి ప్లాట్ల కేటాయింపు

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 20: మైలవరం టెక్స్‌టైల్ పార్క్‌లో చేనేత జౌళి యూనిట్ల స్థాపన కోసం లాటరీ పద్ధతి ద్వారా 3 మంది వాటాదారులకు ప్లాట్లను కేటాయించారు. దీనికి సంబంధించి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ లోతేటి శివశంకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. 2005-06లో అప్పటి ప్రభుత్వం మైలవరంలో 62.18 ఎకరాల స్థలాన్ని టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కేటాయించిందన్నారు. ఇందులో డైయింగ్, గార్మెంట్, హ్యాండ్లూమ్, హ్యాండ్లూమ్స్ మరియు పవర్ యూనిట్స్ కలిపి మొత్తం 118 యూనిట్స్ ఏర్పాటు చేసేందుకు వాటాదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీరందరికీ శుక్రవారం లాటరీ తీసి ప్లాట్లను దక్కించుకున్న 93 మందికి యూనిట్స్ ప్రారంభించడానికి తాత్కాలిక హక్కు కల్పించామన్నారు. ఆరు నెలల్లో నిర్మాణాలు పూర్తిచేసి ఉత్పత్తిని ప్రారంభించుకోవచ్చన్నారు. చేనేత కార్మికులకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా సబ్సిడీతో రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం అందుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, చేనేత జౌళి శాఖ ఆర్ఎం రాజారావు, ఏడీ నాగరాజారావు, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, డిప్యూటీ జెడ్ఎం మాధవీలత పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యుల నిరసన





డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు


కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 20: తమ ప్రాథమిక డిమాండ్ అయిన జీవో నెంబరు 85 రద్దు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని పీహెచ్‌సీల వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 10 నుంచి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యులు దశల వారీగా ఆందోళన చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలిపి 23వ తేదీన చలో విజయవాడ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. జీవో 85 ఉప సంహరణతో పాటు సకాలంలో పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు వంటి తమ సేవలకు సంబంధించిన ఇతర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఏపీ పీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్ర, జనరల్ సెక్రటరీ డాక్టర్ వినయ్ కుమార్, కోశాధికారి డాక్టర్ మహమ్మద్ తాహ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవల ప్రగతిలో జిల్లాకు 'ఏ' గ్రేడ్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 20: ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాకు 'ఏ' గ్రేడ్ దక్కిందని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆసుపత్రులకు వైద్య సేవలకు వచ్చిన అవుట్ పేషంట్లు, ఇన్ పేషంట్లు, ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, ల్యాబొరేటరీలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కుటుంబ నియంత్రణ చేయుంచుకున్న వారి సంఖ్యను బట్టి రాష్ట్రంలో కడప జిల్లాకు ఏ గ్రేడ్ దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు అభినందనలు తెలిపారు.

# నిన్న వారు.. నేడు వీరు

ఐదేండ్లు అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో భూ దందాలు, భూ ఆక్రమణలకు తెగబడ్డారు. దీనిని ఆదర్శంగా తీసుకున్న టీడీపీ నేతలు కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే వైసీపీ నాయకులకు తగ్గేదేలే అనేలా.. చెరువులు, కొండగుట్టలు కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దంటూ సీఎం చంద్రబాబునాయుడు పదే పదే హెచ్చరిస్తున్నా.. బద్వేలులో ఖాతరు చేయడం లేదు.



భాకరాపేట చెరువులో ఆక్రమించేందుకు చెరువుపోరంబోకు స్థలం చదును చేసిన దృశ్యం

- ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జా చేస్తున్నారు
- భూ కబ్జాల్లో తగ్గేదే లేదంటున్న టీడీపీ నాయకులు
- భాకరాపేట చెరువు భూమి, కొండగుట్టలు కబ్జా

బద్వేలుటౌన్, సెప్టెంబరు 20: నిన్నటి వరకు బద్వేలులో వైసీపీ నాయకులు కబ్జా చేస్తుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారు. ప్రభుత్వం మారింది మేము కూడా కబ్జా చేస్తామంటూ టీడీపీ నాయకులూ మొదలు పెట్టారు. ప్రభుత్వ స్థలాలు బద్వేలులో కబ్జాలకు గురవుతుంటే సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు తప్ప వారిపై చర్యలు తీసుకోవడం లేదు. చెన్నంపల్లె రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 1581లో సుమారు 70 సెంట్ల స్థలాన్ని టీడీపీ నాయకులు ఎక్సకవేటర్‌తో చదును చేశారు. ఈ విషయం అధికారులకు తెలిసినా వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పేద ప్రజలు ఎక్కడైనా సెంటుభూమిలో గుడిసె వేసుకుంటే చాలు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లి పేదలను బెదిరిస్తుంటారు. ఇప్పుడు చెన్నంపల్లె పరిధిలోని ప్రభుత్వస్థలాల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరుగుతుంటే ఎందుకు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



చెన్నంపల్లెలోని జగనన్నకాలనీ సమీపంలో చదునుచేసిన ప్రభుత్వ భూమి

### భాకరాపేట చెరువుపై కబ్జాదారుల కన్ను

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో భాకరాపేట చెరువును కబ్జాదారులు దర్జాగా కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 80 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో ఇప్పటికే సుమారు 12 ఎకరాల వరకు కబ్జాచేసి అక్రమ కట్టడాలు నిర్మించారు. తాజాగా భాకరాపేట చెరువులో కంపచెట్లను తొలగించి సమారు 50సెంట్ల భూమిని ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. చెరువు ఆక్రమణతో నీటి నిలువ సామర్థ్యం తగ్గి ఇప్పటికే పంటలకు సక్రమంగా నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారులు ప్రభుత్వ భూములను, చెరువులను కుంటలను సైతం దర్జాగా ఆక్రమించుకుని నకిలీ పత్రాలను సృష్టించి యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుపుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, నీటి పారుదలశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. తక్షణమే రెవెన్యూశాఖ, నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి భాకరాపేట చెరువు పోరంబోకు స్థలంలో బోర్డును ఏర్పాటుచేసి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై నీటిపారుదలశాఖ డీఈ వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా చెరువులు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని, కబ్జాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గోపవరం తహశీల్దారు ఉదయ భానును భూకబ్జాలపై వివరణ కోరగా వెంటనే పరిశీలించి ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

## షోలాపూర్ - తిరుపతి ప్రత్యేక రైలు గడువు పొడిగింపు



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20: షోలాపూర్-తిరుపతి (01437, 01438) మధ్య నడిచే ప్రత్యేక రైలు గడువు పొడిగించారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్దన్ తెలిపారు. ఈ నెల 26 వరకు షోలాపూర్ తిరుపతి మధ్య నడిచే రైలును డిసెంబరు 27 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ రైలుకు కడప, ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్లలో స్టాపింగ్‌ఉన్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కలెక్టర్

కమలాపురం రూరల్, సెప్టెంబరు 20: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. శుక్రవారం కమలాపురం నియోజకవర్గం పొడదుర్తి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం.. ఎందుకంటే' అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా.. ఒక వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమాన్ని రెండు కళ్లలాగా చూస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. యువకుడైన క్రిష్ణచైతన్యరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారని అనునిత్యం కమలాపురం అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి చంద్రబాబు సహకారంతో కేంద్ర ప్రభుత్వం 2 వేల కోట్లు కేటాయించడం జిల్లా అభివృద్ధికి పునాది అని తెలిపారు. డీఎస్సీ కోచింగ్ తీసుకునేందుకు ఆర్థిక స్థోమత లేనివారు ఎవరైనా ఉంటే వారికి సాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పొడదుర్తి గ్రామ పంచాయతీకి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.5లక్షలు కేటాయించామన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పింఛన్లు ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.4వేలు ఇవ్వడంతో పాటు మొదటి నెల ఒక్కొక్కరికి రూ.7వేలు చొప్పున, ఒకే రోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4408 కోట్లు పంపిణీ చేయడం దేశంలోనే చరిత్రగా నిలిచిపోతుందన్నారు. ప్రతి నెలా 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంతో పాటు పింఛన్ల పంపిణీ కూడా చేస్తున్నామన్నారు. పేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.5తోనే ఆకలి తీర్చే 175 అన్నక్యాంటిన్లు పునఃప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శివరామిరెడ్డి, ఎంపీడీవో జ్యోతి, మండల అధికారులు, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం.. ఎందుకంటే కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్


# అల్జీమర్స్... చికిత్స లేని జబ్బు

- వ్యాధి తీవ్రతను మాత్రమే తగ్గించవచ్చు
- జబ్బు కనుగొనడానికే.. పదేళ్లు సమయం
- ఆహార అలవాట్లు, జీవనశైలితోనే నివారణ
- నేడు ప్రపంచ అల్జీమర్స్‌డే



కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 20: ఇంట్లో బండితీగాలు ఎక్కడో ఒక చోట పెట్టడం... ఎక్కడెక్కడో వెతకడం.. కళ్లజోడు ఇక్కడే పెట్టాను.. కనిపించడం లేదే.. అంటూ ఇంట్లోని వాళ్లపై అరవడం... ఏదైనా వస్తువు అవసరం వచ్చినప్పుడు ఒక పట్టాన గుర్తుకు రాకపోవడం... లాంటివి సాధారణంగా ప్రతి ఇంటిలో... ప్రతి రోజూ జరిగే తంతే ఇది.. అయితే ఇలా ప్రవర్తించే వ్యక్తుల్లో మతిమరుపుస్థాయి ఎక్కువైతే.. దీనినే అల్జీమర్స్ (మతిమరుపు) అని అంటారు. ఈ వ్యాధి తీవ్రత ఎక్కువైతే.. ఇంట్లో పెట్టిన వస్తువులను మరిచిపోవడం కాదు కదా.. ఇంటినే మర్చిపోయేంత.. ఇంకా చెప్పాలంటే .. తనను తానే.. తన పేరును, ఊరును చివరికి తన ఒంటి మీద బట్టలు ఉన్నాయో లేదో గుర్తురెగకపోవడం.. ఎవరైనా పిలిచినా పలకరు. ఎవర డిగినా చెప్పరు. చెప్పలేరు కూడా. ఈ వ్యాధి తీవ్రత మాటల్లో చెప్పినంత కాకుండా.. అంతకు మించే ఉంటుంది. అసలు తమను తామే మరిచి పోయి ఒక రకమైన నిస్సహాయ ప్రపంచంలో బతుకుతుంటారు. ఇలా అల్జీమర్స్ వ్యాధిన పడ్డ వారిని గుర్తించి, ఈ వ్యాధి తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్‌డేను నిర్వహిస్తారు.

### అల్జీమర్స్... వ్యాధి తీవ్రమైతే..



అల్జీమర్స్ ఈ పదం వినడానికి, అనడానికి చాలా తేలికగానే ఉన్నప్పటికీ ఈ వ్యాధి తీవ్రత చాలా భయానకం. వ్యాధిని కనుగొనడానికే సుమారు పది సంవత్సరాలు పడుతుంది. మతిమరుపునకు సంబంధించిన 'డిమెన్షి యా'లో ఒక రకం ఈ అల్జీమర్స్. ఈ అల్జీమర్స్ వల్ల మెదడులో నిక్షిప్తమై ఉండే జ్ఞాపకాలు, నైపుణ్యాలు, అనుభవాలు, శక్తి సామర్థ్యాలు, నేర్పు ఓర్పు అన్నీ తుడుచుకు పోతాయి. ఈ అల్జీమర్స్ వల్ల మానసిక, సామాజిక నైపుణ్యాలు పూర్తిగా క్షీణిస్తాయి. సాధారణంగా వయసుపైబడ్డ వాళ్లలో అంటే 60 సంవత్సరాలు దాటిన వారిలో అల్జీమర్స్ అధికంగా కనబడుతుంది. కానీ నేటి యాంత్రిక జీవనంలో ఇంతకంటే చిన్నవయస్సులోనే ఈ వ్యాధి బారిన జనాలు పడుతున్నారు. ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడమే ఉత్తమం.

### వ్యాధిని గుర్తించడం ఎలా...



అల్జీమర్స్ వ్యాధిని గుర్తించడం చాలా కష్టం. కుటుంబ సభ్యులు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి.. వైద్యులను సంప్రదిస్తే తప్ప ఈ వ్యాధి సోకిందని గుర్తించలేరు. వీరు ఇతరులకంటే భిన్నంగా ప్రవర్తిస్తుంటారు. ఇతరుల సమక్షంలో బట్టలు మార్చుకోవడం, పట్టరాని కోపంతో ఊగిపోవ డం, కారణం లేకుండానే భావోద్వేగాలకు లోనుకావడం, తమను తాము నియంత్రించుకోలేక పోవడం, నిరాశతో ఉండడం, బరువు తగ్గడం, చర్మ సంబంధిత వ్యాధులు, ఇన్ఫెక్షన్లు రావడం, గొణుక్కోవడం, మూలగడం, యూరిన్ నియంత్రించుకోలేకపోవడం, మాటల్లో తేడా, నిర్ణయాలు తీసుకోలేకపోవడం, ప్లానింగ్ లేకపోవడం, కొట్టడం, నవ్వడం, నిద్రపోకపోవడం, బట్టలు చించుకోవడం, గొనుక్కోవడం, తమలో తామే మాట్లాడుకోవడం, చుట్టూ ఉండేవారిని.. పరిసరాలను పట్టించుకోకపోవడం, అన్నింటినీ మించి అనుమానించడం వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స ప్రారంభించాలని మెంటల్ హెల్త్ హేర్ కడప వైద్యులు వెంకటరాముడు తెలిపారు.



ఈ ఫొటోలోని వ్యక్తి ముద్దనూరు ప్రాంతానికి చెందిన ఎంబీబీఎస్ వైద్యు డు. వయసు 72 సంవత్సరాలు. ఈయన గత కొంతకాలంగా ఈ అల్జీమర్స్ వ్యాధి బారిన పడ్డారు. ఈయన భార్య నర్సింగ్ అధికారిణి. ముగ్గురు సంతానం. ప్రముఖ నగరాల్లో మంచి స్థాయిలో ఉన్నారు. ఈయనకు ఇవేవీ గుర్తు లేక ఇంట్లో నుంచి వెళ్లిపోయి రోడ్ల వెంట తిరుగుతూ భిక్షాటన చేస్తుండేవారు. దీనబంధు అసోసి యేషన్ వారు ఈయనను గుర్తించి తీసుకువచ్చి కడప మెంటల్ హెల్త్ కేర్‌లో చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం ఈయన చికిత్సలో పొందుతున్నారు. బాధాకరమైన విషయం ఏంటంటే, ఈయన బ్యాంకు అకౌంటులో సుమారు రూ.20లక్షల పైనే డబ్బులు ఉండడం, అది ఆయనకు తెలియక కాదు గుర్తులేకపోవడమే.



### నయం చేయలేం... తీవ్రతను తగ్గించవచ్చు

అల్జీమర్స్ వ్యాధిని పూర్తిగా నయం చేయలేం. 60సంవత్సరాలు దాటిన వారిలో ఇది ఎక్కువగా కనబడుతుంది. ముదిరితే ఏమీ చేయలేం. పై లక్షణాలు ముందుగానే గుర్తించి వైద్యుడిని సంప్రదించాలి. అర్లీ డెమెన్షి యాలో చికిత్సకు అనుకూలంగా ఉంటుంది. ఆహారపు అలవాట్లు, తీసుకునే తిండి, నిద్ర, జీవనశైలిపై ఈ అల్జీమర్స్ వ్యాధి ఆధారపడి ఉంటుంది. సరైన ఆహార నియమాలు, సమతుల్య ఆహారం, నీరు ఎక్కువగా తాగడం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తే ఈ వ్యాధిని నియంత్రించ వచ్చు. మెదడుకు పదను పెట్టే పనులు, గుర్తుంచుకునే సామర్థ్యాన్ని పెంపొందించే పనులు చేయాలి. చాలా వరకు శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి,

*- డాక్టర్ వెంకటరాముడు, మెంటల్ హెల్త్‌కేర్, కడప సూపరింటెండెంట్*

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 20: బ్రహ్మంగారిమఠంలోని ఓ బెల్టు షాపు వద్ద సోమిరెడ్డిపల్లె సింహరాయలు (38) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సింహరాయులు మదిరెడ్డిపల్లె గ్రామం నుంచి రోజు వారి లాగానే గురువారం ఉదయం బ్రహ్మంగారిమఠంకు వచ్చారు. రాత్రి తిరిగి ఇంటికి వెళ్ల లేదు. శుక్రవారం తెల్లవారేసరికి బెల్టుషాపు వద్ద శవమై కనపించాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని భార్య, బంధువులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. తన భర్తను హత్య చేశారంటూ మృతుని భార్య విజయమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి.. మృతుడు మద్యం తాగి మృతి చెందాడా.. హత్య చేశారా అనే విచారణ చేస్తున్నట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 4 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె, సెప్టెంబరు 20: రాయవరం అటవీ ప్రాంతంలోని ముదుం పాడు బీటు వానుబండ ప్రదేశంలో శుక్రవారం నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక తమిళ కూలీని అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వాహనం ఆపకుండా వెళ్లడంతో వెంబడించి పట్టుకున్నామని తెలిపారు. ఆ వాహనంలో ఇద్దరు ఉండగా ఒకరు తప్పించుకోగా తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన శివకుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. దుంగలు, వాహనం విలువ దాదాపు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. డీఆర్‌వో రమేశ్‌బాబు, ఎఫ్‌బీవోలు అంజనస్వామి, లక్ష్మీప్రసన్న, లీలహరి, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నారాయణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చిన్నమండెం, సెప్టెంబరు 20: కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై మండలంలోని జల్లావాండ్లపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుంకర నారాయణ (63) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. నారాయణ పశువులకు గడ్డి కోసుకొని వచ్చేటందుకు కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఉరివేసుకుని వ్యక్తి మృతి



ఒంటిమిట్ట, సెప్టెంబరు 20: మండల పరిధిలోని కోనరాచపల్లె పంచాయతీ అమ్మవారిపల్లెలో నందుగోపినేని పాపయ్య (35) ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్‌లు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా, మృతుని భార్య తన భర్తను ఎవరో చంపారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## 25 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వల్లూరు, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని పాపాఘ్నినదిలో ఇసుక అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడంతో వారు మరో దారి గుండా ఇసుక తరలిస్తున్నారు. దీంతో గురువారం రాత్రి సీఐ రోషన్ ఆధ్వర్యంలో కడప స్పెషల్ బ్రాంచ్ బృందంతో కలిసి దాడులు నిర్వహించి.. దాదాపుగా 25 ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుబడిన ఆ ట్రాక్టర్లపై స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కంచాలమ్మ గండి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్ సీజ్ చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ నరసింహారెడ్డిలు తెలిపారు. గ్రామస్తుల సమాచారంతో దాడులు చేసి ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

## చెన్నూరు వద్ద...

చెన్నూరు, సెప్టెంబరు 20: మండలంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు రెండు ట్రాక్టర్లు గుర్రంపాడు సమీపంలోని ఇసుక క్వారీ నుంచి, మరో ట్రాక్టరు బలసింగాయపల్లె పరిధిలోని ఇసుక క్వారీ నుంచి ఇసుక అక్రమ రవణా చేస్తూ పట్టుబడ్డాయన్నారు.

## చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే.. బీటెక్ రవి

వేంపల్లె, సెప్టెంబరు 20: చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలను పులివెందుల బీటెక్ రవి ప్రారంభించి.. వివిధ జిల్లాల నుంచి హాజరైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ కోట్లాది జనాభా ఉన్న భారతదేశానికి ఒలంపిక్‌లాంటి క్రీడల్లో పతకాలు తక్కువగా వస్తుంటాయని, తక్కువ జనాభా ఉన్న దేశాలకు ఒలంపిక్ క్రీడల్లో ఎన్నో పతకాలు వస్తున్నాయని తెలిపారు. మన దేశంలో పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంలో తల్లిదండ్రులు ముఖ్యభూమికి పోషించాలని.. ఉపాధ్యాయులు చదువుతో పాటు ఆటలు ఆడడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజెప్పాలన్నారు. అనంతరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బీటెక్ రవిని సత్కరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిదులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



వేంపల్లెలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

## ఆన్‌లైన్‌లో సులువుగా ఇసుక బుక్ చేసుకోవచ్చు : కలెక్టర్

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 20: ఇసుకను సులువుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం మండలంలోని పాపాఘ్నినది సమీపంలో ఉన్న కొత్తపల్లె వద్ద ఉన్న ఇసుక స్టాక్‌పాయింట్‌ను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిలు పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎవరైనా ఎక్కడి నుంచైనా ఏ సమయంలోనైనా సులువుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు అన్నారు. సచివాలయాలకు వెళ్లి యాప్ ద్వారా బుక్ చేసుకుని తర్వాతనే స్టాక్ పాయింట్‌కు వద్దకు వస్తే వీఆర్‌ఓ ద్వారా ఇసుకను లోడింగ్ చేయించుకునే సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భగీరథరెడ్డి, రెవిన్యూ అధికారి రాజశేఖర్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.




స్టాక్‌పాయింట్ వద్ద ఉన్న ఇసుకను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి

## ఆరుగురికి జైలుశిక్ష

కలసపాడు, సెప్టెంబరు 20: మండలంలోని దూలంవారిపల్లె గ్రామా నికి చెందిన ఆరుగురికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బద్వేలు అడిషనల్ కోర్టు జడ్జి వైజే పద్మశ్రీ శుక్రవారం తీర్పు నిచ్చారు. దూలంవారిపల్లెకు చెందిన పంజగాళ్ల వెంకటలక్షుమ్మను సూటిపోటి మాటలతో వేధించడంతో 16.10.2014న విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి చిన్నకుమార్తె పంజగల్ల మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ హాజీవలి కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. ప్రస్తుత కలసపాడు ఎస్‌ఐ చిరంజీవి కేసు విచారణలో భాగంగా సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువైనందున ఆత్మహ త్యకు కారకులైన పంజగల్ల పెద్దవీరమ్మ, పంజగల్ల వీరమ్మ, పంజగల్ల వెంకటసుబ్బమ్మ, వెంకటయ్య, పంజగల్ల వెంకట్రామయ్య, వీరమ్మ లకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

## నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

కడప (క్రైం), సెప్టెంబరు 20 : కడప నగరం మాసాపేట హిందూ స్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన షేక్ సమీర్, ఆరిఫ్, కదీర్, లక్ష్మీదేవి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో కడప ఇన్‌చార్జ్ డీఎస్పీరమాకాంత్ ఆదేశాల మేరకు టూటౌన్ ఎస్‌ఐ హుసేన్, సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఈ మేరకు వారిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## లారీలను నిలిపి చోరీ

ముద్దనూరు సెప్టెంబరు 20:మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని కొత్తపల్లె గ్రామం వద్ద గురువారం తెల్లవారు జామున 12-30 సమయంలో హైవేపై వెళుతున్న లారీలను దొంగలు నిలిపి చోరీకి పాల్పడినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ వివరాల మేరకు... 9 మంది బైకుల్లో వచ్చి లారీలను నిలిపి చోరీలు చేశారు. రెండు లారీలను అడ్డుకొని బెదిరించి డ్రైవర్ల వద్ద ఉన్న ఒక వెండి ఉంగరం, రూ.20వేలు నగదు, 3సెల్‌ఫోన్‌లు చోరీ చేసినట్లు, లారీ డ్రైవర్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సర్వర్ సమస్యతో నిలిచిపోయిన ఇసుక రవాణా

కొండాపురం, సెప్టెంబరు 20: ప్రభుత్వం కొత్తగా ఆన్‌లైన్ ద్వారా ఇసుక పాలసీ ప్రవేశపెట్టి రెండు రోజులైనా మండలంలో ఇసుక సరఫరా జరగ డం లేదు. సర్వర్ సమస్యవల్ల ఇసుక రవాణా జరగలేదని రెవెన్యూ అధికా రులు తెలిపారు. గత కొన్ని రోజులుగా మండలంలోని ఏటూరు ఇసుక రీచ్‌లోకి గండికోట బ్యాక్‌వాటర్ చేరడంతో ఇసుక రవాణా నిలిపివేశారు. తిరిగి బ్యాక్‌వాటర్ రాని ప్రదేశంలో ఇదే రీచ్ నుంచి ఇసుకను స్టాక్ పాయింట్‌కు చేరవేస్తు న్నారు. గురువారం నుంచి ఇసుక రవాణా జరగాల్సి ఉండగా సర్వర్ సమస్యవల్ల నిలిచిపోయింది. సాంకేతిక నిపుణులు సమ స్యను పరిష్కరిస్తున్నారని శనివారం నుంచి ఇసుక రవాణా జరుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

## ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 : గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ప్రొద్దుటూరులోని ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ కార్యాలాయాల్లో డిస్ట్రిక్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ టూటౌన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్టు కార్యా లయాల్లో సీఐ యుగంధర్, రమణారెడ్డిల ఆధ్వర్యంలో పార్శి ళ్లను విప్పి పరిశీలించారు. బయటి ప్రాంతాల నుంచి ట్రాన్స్ పోర్టుల్లో గంజాయిని అక్రమంగా రవాణా చేసినా.. సహ కరించినా కఠిన చర్యలు తప్పవని ట్రాన్స్‌పోర్టు నిర్వాహకు లను హెచ్చరించారు. మీ ప్రమేయం లేకుండా అనుమానా స్పద పార్శిల్స్ వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

## పోలీసు స్టేషన్ చేరిన ప్రేమ పంచాయితీ

- న్యాయం చేయాలంటూ యువతి ధర్నా




బంధువులతో కలిసి పెనగలూరు పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు

పెనగలూరు, సెప్టెంబరు 20: పెనగలూరు మండలం ఈటమాపురం గ్రామం రాచపాలెంలో సమీప బంధువులైన కోసలాదేవి లావణ్య, వెంకటసాయి సమీప బంధువులు. వీరిరువురు డిగ్రీ చదువుకునే రోజుల్లోనే ప్రేమించుకున్నారు. కొంతకాలంగా వెంకటసాయి ప్రియురాలితో మాట్లాడకుండా ఏ సమాచారం తెలపకుండా ఉండడంతో దేవి లావణ్యకు అనుమానం వచ్చింది. వెంకటసాయికి పెళ్లి జరుగుతుందని తెలియడంతో మూడు రోజుల కిందట ఆత్మహత్యకు యత్నించింది. దీంతో విషయం తెలిసిన యువతి తల్లి దండ్రులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజులుగా ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి నాన్చుడు ధోరణితో మాట్లాడుతుండడంతో శుక్రవారం తనకు న్యాయం చేయాలంటూ బంధువులతో కలిసి పెనగలూరు పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీంతో ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి ఈ విషయాన్ని సీఐ దగ్గర మాట్లాడుకోవాలని యువతి బంధువులను రాజంపేట రూరల్ సీఐ దగ్గరకు తీసుకెళ్లారు. కాగా, ఈ సంఘటనపై పెనగలూరు ఎస్‌ఐని వివరణ కోరగా ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించాలని ఇరువురి బంధువులను ఇన్‌స్పెక్టర్ వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కడప విద్యార్థి



కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 20: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి మాస్టర్ శశాంక్ డేవిడ్ (ప్రముఖ జ్యోతిష్య నిపుణులు సురేష్‌బాబు కుమారుడు) ఎంపికయ్యారు. ఆ స్కూల్ పీఈటీ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. కాగా శశాంక్ డేవిడ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆ స్కూల్ కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, డీఎస్‌డీఓ అమృత్‌రాజ్, సెక్రటరీ థామస్ హర్షం వ్యక్తం చేశారు.

## నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, సెప్టెంబరు 20: రాజంపేట జవహర్ నవోదయ విద్యాల్యయంలో 2025-26 సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో ఉమ్మడి కడప జిల్లాలో చదువుకుంటున్న 5వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## నకిలీ బంగారం పెట్టి రుణాలు పొందిన వ్యక్తుల అరెస్టు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20: స్టేట్ బ్యాంకులో నకిలీ బంగారం పెట్టి రుణాలు పొందిన కేసులో పాతకోట వెంకటరమణ, బొంతు శివకుమార్, షేక్‌అబ్దుల్ ఖాదర్ అనే ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. ఈమేరకు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

# వంద రోజుల విజయోత్సవ కార్యక్రమం

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 20: ఏపీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా కడప జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాస్‌రెడ్డి, జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లాల కో ఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనరు మధుసూదన్‌రెడ్డి, జనసేన పార్టీ కడప జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుంగా రమణయ్య, నగర కమిటీ నాయకులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కూటమి ప్రతినిధులు

# ఇది మంచి ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వంలో సమగ్రాభివృద్ధి
- ఈ ప్రభుత్వంలో ప్రజలు హాయిగా జీవిస్తున్నారు
- కడప ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి
- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి





కడపలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి, తదితరులు... సింహాద్రిపురం సమావేశంలో 'ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీటెక్ రవి, అధికారులు...వేంపల్లె: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

సింహాద్రిపురం, సెప్టెంబరు 20: తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడే మంచి ప్రభుత్వమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో బీటెక్ రవి పాల్గొన్నారు. ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను బీటెక్ రవి చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంతో పోల్చుకుంటే తమ ప్రభుత్వం ఎన్నో రెట్లు మేలన్నారు. పింఛన్‌దారులకు వెయ్యి రూపాయలు పెంచడానికి వైసీపీకి నాలుగు సంవత్సరాలు పట్టిందన్నారు. అదే తమ ప్రభుత్వంలో ఒకేసారి రూ.వెయ్యి పెంచడంతో పాటు ప్రభుత్వం మాట ఇచ్చినప్పటి నుంచి రూ.4వేలు పింఛను ఇచ్చిన ఘనత ఎక్కడా లేదన్నారు. నిరుద్యోగ యువతకు 16,437 ఉపాధ్యాయ నియామకాలకు మెగా డీఎస్సీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.భాగంగా టీడీపీ ప్రభుత్వం వంద రోజుల్లో ఏమి చేసింది, భవిష్యత్తులో ఏమేమి హామీలు నెరవేర్చబోతోంది అనే విషయాలను మండల వ్యాప్తంగా గడప గడపకు వెళ్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.5లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతూ వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175కు పైగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. మండల ప్రత్యేక అధికారి సన్నన్న, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ గురప్ప, టీడీపీ నేతలు జోగిరెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమం - అభివృద్ధి ధ్యేయంగా టీడీపీ పనిచేస్తోంది

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 20: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం వేంపల్లె మండల పరిషత్ సభాభవనంలో 'మా మంచి ప్రభుత్వం' గ్రామసభ నిర్వహించారు. మొదట ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతూ రాష్ట్ర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4000 పింఛన్, ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారని, ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్క హామీని అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజ సంపతి, ఈఓఆర్డీ మల్లికార్జునరెడ్డి, ఈఓ సుబ్బారెడ్డి, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో పాటు టీడీపీనేతలు డాక్టర్ సుబాబరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమణ, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి శివ, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఆనందంగా ఉన్నారు: ఎమ్మెల్యే

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. శుక్రవారం కడప నగరం ఎర్రముక్కపల్లె కందిపాలెంలో మన మంచి ప్రభుత్వం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ నిరంకుశపాలనతో ప్రజలు విసిగారని, ఇప్పుడు ప్రశాంత వాతావరణంలో సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్, మున్సిపల్ కమిషనరు వైఓ నందన్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న పాలనే సంక్షేమ పథకాలకు నిలయం

చెన్నూరు, సెప్టెంబరు 20 : చంద్రన్న పాలనే సంక్షేమ పథకాలకు నిలయమని, అలాంటి పాలన పట్ల ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారని ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాల తీరు బాగుందన్నారు. చెన్నూరు మండలంలో అన్నక్యాంటీన్ మంజూరైందని, త్వరలో నిర్మాణానికి పనులు చేపడతామన్నారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు.

**పెండ్లిమర్రిలో ఇది మంచి ప్రభుత్వం**

పెండ్లిమర్రి, సెప్టెంబరు 20: మండల కేంద్రమైన పెండ్లిమర్రి సచివాలయంలో సర్పంచులు నాగమల్లారెడ్డి, గంగిరెడ్డి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సాయి గ్రేష్మ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, విస్తరణ అధికారి శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నెలో...**

సీకేదిన్నె, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని టీడీపీ మండల ఇన్‌చార్జి క్రిష్ణారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలపల్లె పంచాయతీ నాగిరెడ్డిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు.

**పులివెందులలో...**

పులివెందుల రూరల్, సెప్టెంబరు 20:రాగిమానుపల్లె సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు విడుదల చేసి ఇంటింటికి పంపిణీ చేశారు.

**అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

వేముల, సెప్టెంబరు 20: అభివృద్ధి,సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. వేములలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ సమావేశం నిర్వహించారు. స్పెషలాఫీసర్, ఎంపీడీఓ, ఇతర మడలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'లడ్డూను అపవిత్రం చేయడం దుర్మార్గం'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాలంటే భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని, అటువంటి ప్రసాదాలలో చేపనూనె, పందికొవ్వు కలపడం దుర్మార్గానికి టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా కన్వీనరు జనార్ధన్ తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమిషన్ల కోసం కక్కుర్తి పడి నాసిరకం సరుకులతో, జంతువుల వ్యర్థాల నుంచి తీసిన కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యితో ప్రసాదాలు తయారు చేయడం దారుణమన్నారు. జగన్‌రెడ్డికి దేవుడంటే భయము భక్తి లేవన్నారు.

## 'ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు అమానుషం'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : తిరుమల ప్రసాదం కల్తీ విషయంలో టీటీడీ బోర్డు సభ్యులు చంద్ర బాబుపై చేసి వాఖ్యలు అమానుషమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జిలాన్ తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలియుగ వైకుంఠంగా భావించే తిరుమలేశ్వర స్వామి పరమపవిత్ర ప్రసాదాన్ని తయారు చేయడంలో ఆగమశాస్త్రానికి విరుద్ధంగా కల్తీ పదార్థాలను వినియోగించడం క్షమించరాని నేరమన్నారు. దీనికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఐటీఐలో జాబ్‌మేళా

చక్రాయపేట, సెప్టెంబరు 20: స్థానిక ఐటీఐ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పలు సంస్థలు ముందుకొచ్చి ఇంటర్వ్యూలు జరిపారు. ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఈ జాబ్‌మేళ నిర్వహిస్తామని, జాబ్‌మేళాకు హాజరై నచ్చిన ఉద్యోగంలో స్థిరపడాలని కోరారు. ఏపీఎస్ఎస్‌డీసీ, ఎస్ఈఈపీఏపీ, డిక్సన్ కంపెనీలలో దాదాపు 50 నియామకాలు జరిగాయని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వివరించారు.

## భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఎమ్మెల్సీ

చక్రాయపేట, సెప్టెంబరు 20: భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సోమశేఖర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రామగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామాలలో రీసర్వే, సోలార్ సిస్టం కోసం భూములు కోల్పోయి రైతులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. ఎర్రగుడి, కల్లూరుపల్లె గ్రామాలలో సోలార్ ప్లాంట్‌కోసం రిజిస్టర్ భూములు ఆక్రమించుకొని వారికి ఎలాంటి హక్కులు లేకుండా చేశారు. వారు రెన్యువల్ చేసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రీసర్వే గ్రామాలలో రైతులు 1బి,అడంగల్ రాక, మ్యుటేషన్లు కాక రైతులు ఇబ్బందులుపడుతున్నారు. అలాగేపలు గ్రామాలలో తాగునీటి ఎద్దడి ఉంది, మోటర్లు కాలిపోవడంతో తాగునీటి కొరత ఏర్పడిందని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. మూలపల్లె, గడ్డంవారిపల్లె, కల్లూరుపల్లె గ్రామాలలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలులేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాలలో వివిధ రకాల సమస్యలతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీమాధవిబాలకృష్ణ,సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గిడ్డంగివారిపల్లె చెరువుకు కృష్ణాజలాల తరలింపు

వేంపల్లె, సెప్టెంబరు 20: వేంపల్లె మండలంలో మారుమూల గ్రామాలైన గిడ్డంగివారిపల్లె, బక్కన్నగారిపల్లె చెరువులకు కృష్ణాజలాలు పైప్‌లైన్ ద్వారాతరలించే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. గిడ్డంగివారిపల్లెకు చెందిన టీడీపీనాయకులు మల్లంగి భాస్కర్‌రెడ్డి, వేంపల్లె పట్టణ అధ్యక్షులు ఆర్వీ రమేష్‌లు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవిని కలిసి రైతులకు నీటి సమస్య ఉందని, గిడ్డంగివారిపల్లె, బక్కన్న గారిపల్లె చెరువులకు కృష్ణాజలాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బీటెక్‌రవి ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసిరైతుల ఇబ్బంది దృష్ట్యా నీటిని పంపించే కార్యక్రమం చేయాలని సూచించారు. ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి కిందిస్థాయి అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితో ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు టి.వెలమవారిపల్లె పంప్‌హౌస్ వద్ద మోటర్లను ఆన్‌చేయించారు. పీబీసీ కాల్వ నుంచి కృష్ణాజలాలను పైప్‌లైన్ ద్వారా ఐదుకిలోమీటర్ల దూరంలో ఉన్నచెరువుల్లోకి చేరాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఎంతో ఉపయోగకరమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగివారిపల్లె సర్పంచు పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెరువులో పడుతున్న కృష్ణాజలాలు

## గంజాయి పట్టివేత- ముగ్గురు అరెస్టు



లింగాల, సెప్టెంబరు 20: మండలంలోని తేర్నాంపల్లె గ్రామంలో 2.70కేజీల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ వెంకటరమణ తెలలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం ఎప్రాంతంలో అందిన సమాచారం మేరకు గ్రామంలో ముగ్గురు వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నట్లు తెలిసిందన్నారు. ఎస్ఐ మదుసూధన్‌రావు, సిబ్బందితో కలిసి దాడులు చేశారన్నారు. ఈ దాడుల్లో షెక్షావల్లి, సబీర, కుళాయప్ప అనే ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 2.70కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చుకొని తాడిపత్రి, పులివెందుల తదితర ప్రాంతాలకు సరఫరా చేసేవారని గుర్తించామన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

లింగాల, సెప్టెంబరు 20: మండలంలోని పెద్దకుడాల జడ్పీ హైస్కూల్లోని విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలునిర్వహించి బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిదులు కొండారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, రాజేశ్వర్‌రెడ్డి, శేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి భవిష్యత్ తరాల వారికి ఆరోగ్యకర వాతావరణాన్ని అందించాలని కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. శుక్రవారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో కార్పొరేషన్, పర్యావరణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్రం, పర్యావరణ శాఖ ఇంజనీరు శ్రీనివాసులు, స్థానిక కార్పొరేటరు సూర్యనారాయణ రావు, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సమావేశం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 20: మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన పెండ్లిమర్రి మండల స్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సమావేశానికి 22 గ్రామాలకు సంబంధించిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ వాతావరణ కాలుష్యం పచ్చనంతో కూడినటువంటి మొక్కలు పెంచే కార్యక్రమం ప్రతి గ్రామంలో చేయాలని తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తామన్నారు.

## 'బీసీల బాంధవుడు చంద్రబాబు'

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 20: బీసీల బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని టీడీపీ తొగట వీరక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ కొనియాడారు. ఈనెల 19న జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీసీలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐటీఐ సర్కిల్ సమీపంలో గల సమితి జిల్లా కార్యాలయ ఆవరణంలో చంద్రబాబుకు, అలాగే ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు క్షీరాభిషేకం చేశారు. సమితి నాయకులు శ్రీకాంత్, నరేష్, ఎస్. అమీర్‌బాష, ప్రసాద్ పాల్గొన్నారు.


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న చక్రధర్

## నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 20: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, 9959225780 నెంబర్‌కు ఫోన్ చేసి గాని, వాట్సప్ ద్వారా గాని మెసేజ్ చేసి గాని సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు.

## వరద బాధితులకు డిగ్రీ విద్యార్థుల విరాళాలు

వేంపల్లె, సెప్టెంబరు 20: వేంపల్లె స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు వరదబాధితులకు విరాళాలు సేకరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు బియ్యం, దుస్తులు ఇతర వస్తువులు సేకరించారు. దాతల నుంచి రూ.28 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపారు. ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

**వరద బాధితులకు సాయం**

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : పులివెందుల లయోలా కళాశాల వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైవీయూ వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అమాల్‌రెడ్డి మార్గదర్శకంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కళ్యాణి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల నుంచి బియ్యం, దాల్, చక్కెర, నూనె, గోధుమపిండి, బట్టలు సేకరించారన్నారు.

## 'అంగన్వాడీ వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలి'

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 20 :జిల్లాలో అంగన్వాడీ వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కోశాధికారి ఎంపీ అంజనీదేవి ఒక సంయుక్త ప్రకటనలో అధికారులను కోరారు. పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో వర్కర్ల పట్ల రాజకీయంగా వేధించడం సరికాదని తెలిపారు. రాజకీయ వేధింపులు ఆపాలని, చిన్నస్థాయి ఉద్యోగులపై బాధించడం సరైంది కాదన్నారు.

## సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యాశాఖకు అప్పగించాలి

- కలెక్టరేట్ ఏఓకు ప్యాప్టో వినతి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20:కడప మున్సిపల్ కార్పొరేషన్ స్వాధనంలో ఉన్న సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యాశాఖకు అప్పగించాలని ప్యాప్టో జిల్లా చైర్మన్ ఎం.విజయకుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మహ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓ విజయకుమార్‌కు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కడప నగరం చెన్నూరు బస్టాండు సమీపంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యావనరుల కేంద్రం, సైన్స్ మ్యూజియం నిర్మించి కొనసాగించేవారన్నారు. వీటిలో ఉపాధ్యాయులకు భృత్యంతర శిక్షణలు ఇవ్వడంతో పాటు విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిట్‌లా ప్రదర్శనకు వినియోగించేవారన్నారు. అయితే గత కొంతకాలంగా నిధుల కొరత కారణంగా సైన్స్ ప్రదర్శన నిలిచిందన్నారు. ఈ భవనాలు కడప కార్పొరేషన్ స్వాధీనం చేసుకుని అందులో ఆధార్ సెంటరు నిర్వహిస్తున్నారన్నారు. కడప కార్పొరేషన్ పరిధిలో ఉండడం వల్ల విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ నిర్వహణకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. దీనిపై కలెక్టరు కలగజేసుకుని విద్యాశాఖకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు ఆర్.అబ్దుల్లా, నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతపై కేసు నమోదు

కడప (క్రైం), సెప్టెంబరు 20: కడప నగరం బుడ్డాయపల్లి చెరువులో మట్టి తోలుతన్న ట్రాక్టర్లను అడ్డుకున్న టీడీపీ నేత కొండా సుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... బుడ్డాయపల్లి చెరువులో ఎక్సకవేటర్‌తో ట్రాక్టర్లకు మట్టి లోడ్ చేసుకుంటుండగా శివానందపురానికి చెందిన టీడీపీ నేత సుబ్బయ్య అక్కడికి వెళ్లి తన అనుమతులు లేకుండా మట్టి ఎలా రవణా చేస్తున్నారని ట్రాక్టర్లను అడ్డుకోవడంతో పాటు ఎక్సకవేటర్ సూపర్‌వైజర్ పాతకడపకు చెందిన గోపాలకృష్ణ వద్దకు వెళ్లి అనుమతి పేపర్లను లాక్కోని బెదిరించినట్లు తెలిపారు. గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు సుబ్బయ్యపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

వల్లూరు, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉపాధి పనిచేస్తున్న కూలీ గంగులయ్య (68)కు గుండెపోటతో మృతి చెందాడు.శుక్రవారం ఉదయం ఉపాధి పనికి వచ్చిన గంగులయ్య సంఘటనాస్థలి వద్ద స్పృహ తప్పి పడిపోవడంతో చికిత్స నిమిత్తం కమలాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతిచెందినట్లు ఉపాధి అధికారులు తెలిపారు. ఎంపీడీవో జయశ్రీ, ఏపీవో సుధారాణి, ఉపాధి సిబ్బందితో కలిసి పెద్దపుత్తకు వచ్చి గంగులయ్య మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

## 'అక్రమ నిర్మాణాలను ఆపేయండి'

కడప (మారుతీనగర్) సెప్టెంబర్ 20: మైదుకూరు మండలం నంద్యాలంపేట గ్రామ పొలం సర్వే నెంబర్ 834-3లో గల 11.21ఎకరాల ప్రభుత్వ రాళ్లగుట్ట భూమిని ఓ మతానికి చెందిన పెద్దలతో పాటు ఓ ప్రభుత్వ ఉద్యోగి (టీచర్) ఆక్రమించుకుని చర్చితో పాటు గృహాలు నిర్మిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మచ్చయ్యగారి నాగమల్లేష్ ఆరోపించారు. శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వారధిలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు యామిని శర్మ, బిట్రా శివనారాయణలను కలిసి విన్నవించారు. ఈ విషయమై గత జులై 15న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 11న బద్వేల్ ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.


బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులను కలిసిన బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు నాగ మల్లేష్

## 'వంద రోజుల పాలనపై హడావుడి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై హడావుడి చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏమీ చేయకపోయినా చేసినట్లు ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాకాసురేశ్, పులిసునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## వైవీయూలో రూసా ప్రాజెక్టు ఫెలోల నియామకం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20 : వైవీయూ ముగ్గురు ప్రాజెక్టు ఫెలోలను నియమించింది. మెటీరియల్ సైన్స్, నానో టెక్నాలజీ ప్రొఫెసరు ఎంవీ శంకర్, సహాయాచార్యులు డాక్టర్ ఎస్.ఆదినారాయణరెడ్డి, డాక్టర్ మమత కుమారి మార్గదర్శకంలో కె.బాలసుబ్బారావు, కేదారేశ్వర్, సంతోష్‌లను ప్రాజెక్ట ఫెలోల నియమిస్తూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి నియామక పత్రాలను అందించారు. నాణ్యమైన పరిశోధనలు పత్రాలు రూపకల్పన జరగాలని సూచించారు. రూసా డైరెక్టరు చంద్రశేకర్ మాట్లాడుతూ రూసా 2.0మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రాజెక్టుకు వైవీయూ రూ.10లక్షలు మంజూరు చేశామన్నారు. నాణ్యమైన పరిశోధనల కోసం కృషి చేయాలన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించండి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 20 : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం మండలం పొడదుర్తి గ్రామ పంచాయతీలోని పి.కొత్తపల్లె గ్రామంలోని పాఠశాలలో పొడదుర్తి సర్పంచ్ ఆధ్వర్యంలో కలెక్టర్, కమలాపురం ఎమ్మెల్యే స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

## మద్యం సేవించి బైకు నడిపిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), సెప్టెంబరు 20 : మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్షతోపాటు రూ.2500 జరిమానా విధించినట్లు న్యాయాధికారి మంగళగౌరి తీర్పునిచ్చినట్లు కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కడపకు చెందిన గంగాధర్ మద్యం సేవించి బైకు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. శుక్రవారం న్యాయాధికారి వద్ద హాజరుపరచడంతో జైలు శిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 20 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ వి.బ్రహ్మయ్య పేర్కొన్నారు. మొక్కలు నాటడం వాటిని పరిరక్షించడం ముఖ్యమైందన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని డి-బ్లాక్ ఆవరణంలో ఆయన మొక్కలు నాటారు.

## సమస్యలు పరిష్కరించండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 20: జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండు గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. వారికి ఆస్పత్రిలోని డాక్టర్లు మద్దతు పలికారు.

## హెచ్ఐవీపై అవగాహన సదస్సు

జమ్మలమడుగు, సెప్టెంబరు 20: జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెడ్మాస్టర్ వేదవతి మాట్లాడుతూ లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం ప్రణాళికలు

రాజుపాలెం, సెప్టెంబరు 20 : ప్రజలను అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా లేబర్ అధికారి శ్రీకాంత్ నాయక్ అన్నారు. శుక్రవారం కొర్రపాడు గ్రామ సచివాలయంలోఇది మంచి ప్రభుత్వం కర పత్రాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో షాకీర్‌ఆలీఖాన్, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి,సెక్రటరీ బాబు పాల్గొన్నారు.



# సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

## వందరోజుల పాలనపై ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ● పలు చోట్ల 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం





దొరసానిపల్లెలో ఇంటింటికి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జమ్మలమడుగు కన్నెలూరు సమావేశంలో భూపేశ్‌రెడ్డి దృష్టికి సమస్యను వివరిస్తున్న మహిళ, అట్లూరు సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత రితీష్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 : ప్రజా సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దొరసానిపల్లె గ్రామంలో ఎన్డీఏ కూటమి పాలన వందరోజులు పూర్తయిన సందర్భంగా ఇంటింటికీ తిరిగి మంచి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చించిందని ప్రజలకు తెలియజేశారు. ప్రతి ఇంట్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ,డీఎల్ డీవో సుబ్రమణ్యం, సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ, టీడీపీ పరిశీలకుడు ఏవీఆర్ ప్రసాద్ మండల టీడీపీ అధ్యక్షుడు బోడెల బాబుల్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, తహసీల్దారు వండాడిగంగయ్య, ఎంపీడీవో పశువైద్యాధికారిని డాక్టర్‌సరస్వతి, టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, చౌటపల్లె లక్ష్మీరెడ్డి, మాడెం సుధాకర్‌రెడ్డి, వరద,శివ, శీపాల శివ, బోగా శివకళ్యాణి, కోనేటి క్రిష్ణ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంక్షోభంలోనూ సంక్షేమం... భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, సెప్టెంబరు 20: సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న కూటమి ప్రభుత్వం అని మొదట వంద రోజుల్లోనే ప్రజలచేత ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుంటోందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని కన్నెలూరు 9, 10 వార్డులకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలు మెచ్చిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి టీడీపీ మండల అధ్యక్షులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి , కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్ బానా శివరామలింగారెడ్డి, బిర్రు సంతోష్, వంగల నాగేంద్రయాదవ్, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, డి.చెన్నయ్య, అవిశె శ్రీనివాసులు, నవనీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు.

### మంచి ప్రభుత్వంలో ప్రజలకు అనేక రకాలుగా లబ్ధి

కొండాపురం, సెప్టెంబరు 20: ఎన్డీయే కూటమి మంచి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజలకు అనేక రకాలుగా లబ్ధి చేకూరుతోందని ఎన్డీయే కూటమి మండల ఇన్‌చార్జ్ దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు. ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం ఓబన్నపేట సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు సచివాలయ ఆవరణ పరిధిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ గోపీనాథ్, కూటమి నాయకులు శంకర్‌రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి,బాబురెడ్డి, రామాంజులరెడ్డి, గోరిశెట్టిబాబు,రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అట్లూరు..:** మండలంలోని గ్రామీణ రోడ్లకు రూ.2.15 కోట్ల నిధులతో సిమెంటు రోడ్లను శుక్రవారం అట్లూరు క్రాస్‌రోడ్డులో బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం అట్లూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ సమావేశంలో మండల ప్రజలతో నిర్వహించారు. మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత కూటమి ప్రభుత్వం అనిపించుకున్నదని రితీష్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మంచూరు సూర్య నారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, ఎంపీపీ పొత్తపి రమాదేవి, మండల నాయకులు రెడ్డయ్య, ఎంపీడీవో సుజాతమ్మ, తహసీల్దార్ రవిశంకర్, ఏపీఎం సురేశ్‌బాబు, మండల ప్రత్యేకాధికాధికారి వెంకటసుబ్బయ్య, పీఆర్‌డీఏ రవికుమార్, పంచాయతీ అధికారి శివప్రసాద్, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల..:** వందరోజుల ఎన్డీయే ప్రభుత్వం పాలనలో చేసిన మంచి పనులను వివరిస్తూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైకోడూరులో ఇంటింటికి వెళ్లి ఈ ప్రభుత్వం వందరోజుల్లో ఏం చేసింది అనే విషయంపై బ్రోచర్‌ను చూపిస్తూ ప్రజలకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి సర్పంచ్ వాసుదేవరెడ్డి, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి జగదీశ్వరి అధికారులు పాల్గొన్నారు.

**పెద్దముడియం..:** ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలో అధికారులు శుక్రవారం నిర్వహించారు. మండలం లోని బలపనగూడూరు, పాలూరు తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రామసుబ్బా రెడ్డి, ఎంపీడీవో వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

**చాపాడు..:** ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలువురు అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఇంటింటికి వెళ్లి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు, ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, ఏపీఎం రమణ, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు అక్బర్‌వలి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**బ్రహ్మంగారిమఠం..:** మండలంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని దిగువనేలటూరు గ్రామ పంచాయతీలో ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో వెంగమునిరెడ్డి, మండల నాయకులు సాంబశివారెడ్డి, మన్యం రవిశంకర రెడ్డి, రవీంద్రరెడ్డి,రంగయ్యనాగేశ్‌రెడ్డి,రమణ,పూజా శివయ్యయాదవ్, మేకలసుధాకర్,చిలమల నాగయ్య పాల్గొన్నారు.

**అట్లూరు..:** మండలంలోని ఎగువపల్లె, నల్లగొండుగారిపల్లె కాలనీల్లో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండల యువ నాయకులు జయక్రిష్ణారెడ్డి, మన్యం మహేశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**బద్వేలుటౌన్..:** వందరోజుల పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మంచిచేసి దగ్గరయ్యామని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలువార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మిత్తికాయల రమణ, రాగిమాను ప్రతాప్‌కుమార్, బిగ్‌బాస్, మస్తాన్‌బాబు, కొంకుల రవి, కనమల్లపూటి ప్రసాద్, శివయ్యస్వామి, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, జనసేన నాయకులు సింగం శెట్టి వెంకటసుబ్బయ్య, మురళీ, అధికారులుతదితరులు పాల్గొన్నారు.

**కాశినాయన..:** ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి 100రోజులను పురస్కరించుకొని ఇది మంచిప్రభుత్వం కార్యక్రమం కింద శుక్రవారం వరికుంట్లలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో మైథిలీ మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కిటికీలకు మెష్‌లు ఏర్పాటు

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 20 : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని బాలికల కళాశాల హాస్టల్‌లో టీడీపీ యువనాయకులు యాపరాల చిన్నబురుగోళ్ల చిన్న సొంత ఖర్చులతో కిటికీలకు మెష్ వేయించారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్,ఎంపీ మహేష్ యాదవ్ రెండు రోజుల పర్యటనలో భాగంగా యాపరాల చిన్నబురుగోళ్ల చిన్న తమ సొంత ఖర్చులతో విద్యార్థినులకు పుస్తకాలు ఎమ్మెల్యేఎంపీల చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఆ సమయంలో దోమలు విపరీతంగా ఉన్నాయి కిటికీలకు మెష్ కావాలని విద్యార్థినులు తెలపడంతో శుక్రవారం టీడీపీ నాయకులు వేయించారు.అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని 21,22 వార్డుల ఇన్‌చార్జ్ ఆకుల క్రిష్ణయ్య కేసీ కెనాల్ కట్టపైకొన్ని వీధులలో దారికి అడ్డంగా ఏపుగా పెరిగిన కంప చెట్లను సొంత ఖర్చులతో కొట్టించారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్,దేవరాజ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తణుకు చెరువుకు నీరు నింపాలి

కలసపాడు, సెప్టెంబరు 20 : లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తణుకు చెరువుకు నీరు నింపాలని ఎగువ రామాపురం, ఎగువతంబళ్లపల్లె తెల్లపాడు పంచాయతీల ప్రజలు టీడీపీ యువ నాయకుడు రితీష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు కలసపాడుకు వచ్చిన ఆయనకు తెలుగుగంగ కాల్వకు నీరు విడుదల చేశారని అందులో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తణుకు చెరువుకు నీరందిస్తే దాదాపు 3వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. తెల్లపాడు మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పెద్దవీరారెడ్డి, రమణయ్యపాల్గొన్నారు.

## 'ఇది మంచి ప్రభుత్వం' వివరాలు

చాపాడు, సెప్టెంబరు 20: మండలంలో ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు పేర్కొన్నారు. 20న చాపాడు , 21న అల్లాడుపల్లె, అయ్యవారిపల్లె, భద్రిపల్లె, కుచ్చుపాప గ్రామాలు, 23న చిన్నగురవలూరు, చియ్యపాడు, ఖాదర్‌పల్లె, అన్నవరం, 24న లక్ష్మీపేట, మడూరు, నాగులపల్లె, నక్కలదిన్నె ఓబాయపల్లె, 25న రాజువారిపేట, పెద్దగురవలూరు, పల్లవోలు, సీతారాంపురం, 26న సోమాపురం, సిద్దారెడ్డిపల్లె, తప్పెట ఓబాయపల్లె, వెదురూరు, విశ్వనాథపురం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వంద రోజులు కూటమి ప్రభుత్వం పూర్తయిన సందర్భంగా సంక్షేమ కార్యక్రమాలను అధికారులు ప్రజలకు వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

## అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

గోపవరం, సెప్టెంబరు 20 : గోపవరం మండలంలోని సంగముద్రం గ్రామంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈర్ల రోశయ్య అనే వ్యక్తికి చెందిన పొలంలో ఉన్న గుడిసెకు నిప్పంటుకుని అందులో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తి గుడిసెకు నిప్పుపెట్టాడని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో పలు వ్యవసాయ పరికరాలు కాలిపోయాయి. సుమారు లక్ష రూపాయలు దాకా ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 20: నెల నెలా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని 7వ వార్డులోని స్వరాజ్‌నగర్ మహిళలు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలరు జూన్ నెలలో రేషన్ పంపిణీ చేయలేదని తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీలర్‌ను ఓబులేసును తొలగించి చెన్నయ్యను నియమించారని తెలిపారు. ఆయన జులై నుంచి లబ్ధిదారులకు సగం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ప్రశ్నిస్తే తనకు కేటాయించిన కోటాను అందరికి సమానంగా పంపిణీ చేస్తున్నామని, గత డీలర్ రేషన్ బియ్యాన్ని అమ్ముకోవడంతో అధికారులు కోటాను తగ్గించి ఇస్తున్నారని తెలిపారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

## ప్రొద్దుటూరు అభివృద్ధిపై సీఎంను కలిసిన ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 : విజయవాడలో జరిగిన ఎమ్మెల్యేల సమావేశ అనంతరం సీఎం చంద్రబాబును ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రత్యేకంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు.ప్రొద్దుటూరులో అభివృద్ధి కార్యక్రమాల నిధుల కేటాయింపుతో పాటు వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ఆయన సీఎంకు వినతి పత్రం అందజేశారు. అలాగే త్వరలో నియామకం చేపట్టబోయే నామినేటెడ్ పదవుల్లో ప్రొద్దుటూరులో పార్టీకోసం పనిచేసిన నాయకులకు న్యాయం చేయాలని లిస్టును అందజేశారు. సీఎం ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## కాటాల పరిశీలన

చాపాడు, సెప్టెంబరు 20: తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ప్రొద్దుటూరుకు చెందిన లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జయదేవ్ బరువు తూకం వేసే ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణ డీలర్ల వద్ద ఉన్న కాటాలను అధికారులు పరిశీలించి ముద్రలు వేశారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ డీలర్లు ప్రతి ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరు నెలలో వారి కాటాలను టెస్ట్ చేయించుకోవాలన్నారు. అలా టెస్ట్ చేయించుకోని డీలర్లకు రూ.5 వేలు జరిమానా విధిస్తామన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : సీఐ

గోపవరం, సెప్టెంబరు 20 : నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం అన్నారు. బద్వేలు - నెల్లూరు ప్రధానరహదారిలో ఉన్న మడకలవారిపల్లె వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్ పలు అంశాలను వివరించారు.

## ఉమ్మడి భూమిలో అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలోని క్లస్టర్ స్థాయి జీవనోపాధుల వనరుల కేంద్రంలో ఉపాధి హామీ పథకం సిబ్బందికి శుక్రవారం గోకులాలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ జి.ఆనందం ముఖ్యఅతిథుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ జిల్లా మేనేజరు స్నేహేస్, క్లస్టరు కోఆర్డినేటరు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సంపద నిల్వ కేంద్రాల్లో వానపాములు అందించాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 20 : ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో వానపాముల పెంపకాన్ని వృద్ధి చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ, పోరుమామిళ్ల మండల స్పెషల్ ఆఫీసరు విజయకుమార్ అన్నారు. శుక్రవారం రంగసముద్రం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం.. అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



డ్రమ్ముల్లో ఉన్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 20 : వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ అన్నారు. శుక్రవారం మండలంలోని టేకూరుపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో డ్రైడే నిర్వహించారు. అనంతరం ఆ ఏరియాలోని మలేరియా డెంగీ కేసుల వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం ల్యాబొరేటరీ సందర్శించి రక్తనమూనాలు,రిపోర్టులు సేకరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసరు నరసింహారెడ్డి, హెచ్ఈవో శివశంకర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**బి.కోడూరు..:** బి.కోడూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి శుక్రవారం జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి మనోరమ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగమణి, పుష్పాంజలి, రామచంద్ర, జాన్ విలియం, విజయలక్ష్మి, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లుస్టాఫ్‌నర్సు వేదవతి, కుమారి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పగటి పూట కుట్టే దోమలతోనే డెంగీ

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 20 :పగటి పూట కుట్టే దోమల తోనే డెంగీ వస్తుందని జిల్లా వైద్య అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.పెద్దశెట్టిపల్లె గ్రామ పరిధిలో రెండు డెంగీ కేసులు రావడంతో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. అనంతరం ప్రతి ఇంటిలో తిరిగి నీటి నిల్వలలో లార్వాలు ఉన్నాయెమో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య అధికారి మల్లేష్,డాక్టర్ సుధ,సిబ్బంది నరసింహారెడ్డి,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 'చంద్రబాబు పాలనపై ప్రజలు హర్షం'



మునిశేఖర్‌రెడ్డి

చాపాడు, సెప్టెంబరు 20: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై ప్రజలు హర్షం వెలిబుచ్చుతున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో సీఎంను మెచ్చుకోదగ్గ విషయమన్నారు. దీపావళికి మహిళలకు ఉచితంగా ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నట్లు తెలిపారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ వరదబాధితులకు రూ.లక్ష కూడా ఆర్థికసాయం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం చంద్రబాబు రైతులకు ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1674 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖాజీపేట, సెప్టెంబరు 20: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీఐ మోహన్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాబడిన సమాచారం మేరకు సుంకేసుల ఆంజనేయస్వామి గుడి దగ్గర అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ట్రాక్టరు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.




## నర్సాపురం పోస్టాఫీస్ నిధుల దుర్వినియోగంపై విచారణ



నర్సాపురంలో ఖాతాదారు పుస్తకాలు పరిశీలిస్తున్న సిబ్బంది

కాశినాయన సెప్టెంబరు20: నర్సాపురం పోస్టాఫీస్ కార్యాలయంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణను అధికారులు ముమ్మరంచేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో నర్సాపురం పోస్టాఫీస్‌లో పోస్ట్‌మాస్టర్ చేతివాటం కథనం ప్రచురితమైంది.స్పందించిన అధికారులు నిధుల దుర్వినియోగాన్ని నిగ్గుతేల్చేపనిని వేగవంతం చేశారు. ఇందులో భాగంగా జిల్లా అధికారులు రాయచోటిలో పనిచేస్తున్న అమర్‌నాథ్‌ను బద్వేల్ డివిజన్‌కు ఇన్‌చార్జి అధికారిగా నియమించిబాధ్యతను అప్పగించారు. ఆయన ఆధ్వర్యంలో దాదాపు 15 మంది సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి బద్వేల్ కార్యాలయం, ఇటు నర్సాపురం పోస్టాఫీస్‌లో పుస్తకాల పరిశీలన కార్యక్రమం నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రతి ఖాతాదారుడిని విచారించారు. కాగా ఖాతాదారుల పుస్తకాల పరిశీలన వేగంగా జరుగుతుందని విచారణ అధికారి అమర్ తెలిపారు.

### పేపర్‌మీద రాసి సీల్ వేసి ఇచ్చాడు



నాభార్య బి.నవనీతమ్మ పేరు మీద రూ. 1,70,000 లు పోస్టాఫీస్‌లో కట్టాను.పుస్తకాలు లేవు వస్తే ఇస్తాను అని తెల్ల పేపర్‌పైన రాసి సీల్‌వేసి సంతకంచేసి ఇచ్చాడు. అధికారులేమో పుస్తకం ఉంటే ఇవ్వలేకుంటే మేము ఏమీచేయలేము అంటున్నారు.20 రోజులుగా పనులు పోగొట్టుకొని కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నాను.

**బి.వెంకటయ్య, ఉప్పలూరు ఎస్సీకాలనీ.**

### ఇంతదారుణమా

కూతురు పేరుమీద సుకన్య పథకంలో రూ.1,90,000లు కంతుల వారీగా కట్టాను. పుస్తకం ఇవ్వకుండా పోస్ట్‌మ్యాన్‌వద్దనే ఉంచుకున్నాడు.తీరా చూస్తే ఆన్‌లైన్‌లో రూ. 57,000 లు మాత్రమే ఉంది. ఇంత దారుణమా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

**మహబూబ్‌బాషు, నర్సాపురం**

## కల్తీ నెయ్యి సరఫరా చేయడం దుర్మార్గం : రితీష్‌రెడ్డి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 20 : శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీనెయ్యిని సరఫరా చేయడం దుర్మార్గమని, తిరుమల పవిత్రను వైసీపీ నాయకులు భ్రష్టు పట్టించారని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి గత వైసీపీ ప్రభుత్వంలో దేవుడి ప్రసాదంలో కల్తీనెయ్యినివాడి శ్రీవారి లడ్డూతో ఆటలాడటం ఘోరమైన చర్య అన్నారు.కార్యక్రమంలో నాయకులు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, రామానాయుడు, మస్తాన్‌బాబు, కూటమినేతలు తదితరులు పాల్గొన్నారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 20 : హిందువులు పవిత్ర దేవాలయమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుమల పుణ్యక్షేత్రంలో లడ్డూ తయారీకి జంతువుల కొవ్వు వాడడం నేరమని, సమగ్ర విచారణ జరిపి ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.